రోడ్లపై యమ కింకర

- అధిక కిరాయిలకు ఆశపడి ఓవర్ లోడింగ్‌తో కంకర రవాణా
- రహదారులపై జారిపడుతున్న కంకరతో రోడ్డు ప్రమాదాలు
- మైనింగ్ బిల్లులు లేకుండానే యథేచ్ఛగా రవాణా


జి.కొండూరు మండల పరిధి ఆత్కూరు గ్రామం వద్ద రహదారిపై జారిపడిన కంకర

జి.కొండూరు: సాయంత్రమయితే చాలు రయ్యి మంటూ లారీలన్నీ రోడ్డెక్కుతాయి. మైనింగ్ బిల్లులు లేకుండా పరిమితికి మించి మెటల్ కంకరను ఓవర్ లోడింగ్ చేసి యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తాయి. లారీలలో కంకర జారి రహదారులపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వందలాది లారీలు రాత్రంతా వీర విహారం చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడేలేడు. ఓవర్‌లోడింగ్, వేగ నియంత్రణపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా దాడులు జరిపి వదిలేస్తున్నారు. దీనితో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నియోజకవర్గంలో..

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో క్వారీల నిర్వహణ అధికంగా సాగుతోంది. ఈ మండలాల పరిధిలోని దొనబండ, కాచవరం, కీలేశపురం, కేతనకొండ, కొండపల్లి, మూలపాడు, గడ్డమణుగు లోయ ప్రాంతంలో 25 నుంచి 30 క్వారీల వరకు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్వారీలలో బ్లాస్టింగ్‌ల ద్వారా పెద్ద పెద్ద బండరాళ్లను క్రషర్లకు తరలించి 40 ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, బేబీ చిప్స్, డస్ట్, వెట్ మిక్స్ ఇలా రకరకాలుగా విభజించి స్థానికంగా నిర్మిస్తున్న కట్టడాలు, రహదారులకు సరఫరా చేస్తున్నారు. ఈ క్వారీల నుంచి రోజుకి 200లకు పైగా భారీ వాహనాలతో మెటల్ కంకరను విజయవాడ పరిసర ప్రాంతాలకు తరలిస్తుంటారు.


జి.కొండూరులో ఓవర్‌లోడుతో వెళుతున్న కంకర లారీ (ఫైల్)

అధిక కిరాయిల కోసం..

అధిక కిరాయిల కోసం లారీల యజమానులు 20 టన్నుల లోడు పరిమితి ఉన్న టిప్పర్ లారీలకు 35 నుంచి 40 టన్నులు, 30 టన్నుల పరిమితి ఉన్న లారీలకు 50 టన్నుల వరకు కంకర లోడు చేసి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నారు. ఓవర్ లోడింగ్ కారణంగా లారీలో కంకర మలుపుల వద్ద రహదారిపై కుప్పలు తెప్పలుగా జారిపడుతోంది. దీని వల్ల రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు కంకర ఉన్న ప్రదేశంలో టైర్లు జారిపోయి అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి ఈ టిప్పర్ లారీలను నడపడం వల్ల లారీలు అదుపుతప్పి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఓవర్ లోడింగ్, వేగ నియంత్రణ చేయాల్సిన అధికారులు ఏడాదికొక్కసారి నామమాత్రపు డ్రైవ్‌లు పెట్టి వదిలేస్తున్నారు.

ఆ లారీలను సీజ్ చేయాలి



కంకర లారీలు అధిక లోడుతో రవాణా చేయడం వల్ల లారీల నుంచి కంకర జారి రోడ్లపై పడుతోంది. మలుపుల వద్ద ఈ కంకర వల్లన ప్రమాదాలు జరుగుతున్నాయి. కిరాయిల కోసం లారీ ట్రక్కుపైన మూడు అడుగుల మేర అధికంగా లోడు చేసి తరలిస్తున్నారు. అప్పుడప్పుడు దాడులు చేసి జరిమానాలు విధించి వదిలేయడం వల్లన అదే తప్పు మరలా చేస్తున్నారు. అధికారులు స్పందించి ఓవర్‌లోడింగ్ చేస్తున్న లారీలను సీజ్ చేయాలి.

– కె.బాలకృష్ణ, గ్రామస్తుడు, జి.కొండూరు

ప్రమాదాలు జరుగుతున్నాయి



టిప్పర్ లారీలకు ట్రక్కుపైన ఎత్తుగా మెటల్ కంకరను లోడు చేసి తరలించడం వల్ల కంకర జారి రోడ్లపై పడుతోంది. దీని వల్లన బైకులపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లను సైతం ఓవర్ లోడింగ్ చేస్తున్నారు. ఒకవేళ ఆ బండరాళ్లు జారి పడితే పక్కన వెళ్లే వాహనాలపై పడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలి.

– వేములకొండ విష్ణు, గ్రామస్తుడు, జి.కొండూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు

తిరువూరు: తిరువూరు పోలీసులు స్థానిక లాడ్జీలలో శనివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ప్రకారం మాత్రమే గదులు కేటాయించాలని, అద్దెకు తీసుకునే వారి వివరాలు పూర్తిగా నమోదు చేయడంతో పాటు వారి ఆధార్ కార్డు కూడా రికార్డు చేయాలని ఎస్ఐ సత్యనారాయణ లాడ్జీల నిర్వాహకులను ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, నేర చరితులకు గదులు ఇవ్వవద్దని, అనుమానితులు వస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్రికెట్ బెట్టింగులు, వ్యభిచారం, మాదక ద్రవ్యాల వినియోగం తదితర అవసరాలకు లాడ్జీలలో గదులు అద్దెకు ఇస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆధునిక వైద్య సదుపాయాలపై సెమినార్

తిరువూరు: ఆధునిక వైద్య సదుపాయాలపై సెమినార్ కార్యక్రమం స్థానిక వీ కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయవాడ సెంటినీ ఆస్పత్రి సహకారంతో జరిగిన కార్యక్రమంలో వైద్య పరికరాల నవీకరణపై అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రోగులకు నాణ్యమైన సత్వర సేవలందించడంపై పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రస్తుతం అందుతున్న ఆధునిక వైద్య సేవలను వివరించారు. సెంటినీ ఆస్పత్రి ఎండీ ముప్పా పద్మ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు ప్లేట్లు, పండ్లు పంపిణీ



కాచవరం(ఇబ్రహీంపట్నం): ఈస్టర్ పండుగ సందర్భంగా కాచవరం అమ్మ–నాన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో ప్లేట్లు, వాటర్ బాటిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పాస్టర్ మోగులూరి ఎలీషా ప్రార్థన చేశారు. సంస్థ కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటర్ టాపర్స్‌కు ప్రోత్సాహక బహుమతులు



మైలవరం: ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకర్లు బూక్యా హరిణి, పఠాన్ షాజిదాకు ఆదివారం ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. వెల్వడం గ్రామానికి చెందిన సరస్వతి సేవా ఫౌండేషన్ వారి సౌజన్యంతో డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులను పీఆర్‌టీయూ నాయకులు పి.గోపాల్, ఉపాధ్యాయులు సూరిబాబు, శరత్, సతీష్, పుల్లారెడ్డి, వెంకటేష్, శేషగిరిరావు, తులసి అభినందించారు.

1,020 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 1,020 మంది మధుమేహం, రక్తపోటు, మూర్ఛవ్యాధిగ్రస్తులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. రక్తపోటు, మధుమేహం బారిన పడిన వారు మందులు వాడితే సరిపోదని, సరైన ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం తప్పక చేయాలని డాక్టర్ గోపాళం శివన్నారాయణ సూచించారు. రోజుకు రెండుసార్లు మాత్రమే ఆహారం తీసుకోవాలని, కనీసం ఒకపూట తృణధాన్యాలు తీసుకోవాలని చెప్పారు. వైద్యులు రవీంద్ర, సత్యతేజ, లక్ష్మణరావు, శివాజీ రోగులను పరీక్షించారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు హరికృష్ణ, గంగాధర్, పాపారావు, సుభానీ పర్యవేక్షించారు.

ప్రమాదాల నియంత్రణకు పోలీసుల స్పెషల్ డ్రైవ్



తిరువూరు: రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా లారీ డ్రైవర్లకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమాన్ని తిరువూరు పోలీసులు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సూచనల మేరకు విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాత్రివేళల్లో నిద్రలేమితో వాహనాల డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నందున తెల్లవారు ఝామున 3 నుంచి 5 గంటల సమయంలో వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే విధంగా తిరువూరు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది జాతీయ రహదారిపై భారీ వాహనదారులకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఘనంగా ఏఐబీఈఏ వార్షికోత్సవం

నూజివీడు: ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వార్షికోత్సవాన్ని నూజివీడు కేడీసీసీబీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కినేని రాజా అధ్యక్షత వహించారు. ఏఐబీఈఏ జెండాను ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పాలకులు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, బ్యాంకు ఉద్యోగ కార్మికులు అందరూ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, బ్యాంకు ఉద్యోగులు రామ్ శంకర్, అక్కినేని ప్రసాద్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

శిథిలావస్థలో తాత్కాలిక పంచాయతీ భవనం

ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయాందోళన

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయతీ తాత్కాలిక భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులూడిపడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భవనంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గది, ఏఎన్ఎం గది, వీఆర్వో గది, సచివాలయ సిబ్బంది మొత్తం నాలుగు గదుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

35 ఏళ్ల కిందట నిర్మాణం..

సుమారు 35 సంవత్సరాల కిందట ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం కోసం ఈ భవనాన్ని నిర్మించారు. 2011లో బాలికల వసతిగృహాన్ని ప్రభుత్వమే ఖాళీ చేసింది. అక్కడ చదువుతున్న బాలికలను విజయవాడలోని హాస్టల్‌లో కలిపివేశారు. దీంతో ఖాళీగా ఉంటున్న బాలికల హాస్టల్ భవనంలోకి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మార్చివేశారు. అప్పటికే శిథిలావస్థలో ఉన్న పాత గ్రామ పంచాయతీ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని భయానక పరిస్థితిలో మార్పు చేయగా ప్రస్తుతం హాస్టల్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది.

అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం..

గత వైఎస్సార్ ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులు రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభించగా, ఇంకా ఎలక్ట్రికల్ పనులు, ప్లంబింగ్ పనులు పూర్తి కాలేదు. దీంతో సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం త్వరలో పూర్తి చేసి ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన కె. తాడేపల్లి పంచాయతీ భవనం

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక అధికారి ఎం.గౌతమ్

మైలవరం: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి ఎం.గౌతమ్ అన్నారు. మైలవరంలో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. మైలవరంలోని అగ్నిమాపక కేంద్రంలో గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రోటరీ క్లబ్ సభ్యులు, వెటర్నరీ సిబ్బందికి వర్క్‌షాపు నిర్వహించి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. గౌతమ్ మాట్లాడుతూ అగ్గిపుల్లలు వెలిగించి పూర్తిగా ఆర్పకుండా పడవేయవద్దని, గ్యాస్ స్టౌలు వెలిగించి వంట పని పూర్తి కాగానే రెగ్యులేటర్ వద్ద ఆఫ్ చేయాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలాజీ, ఎన్‌వీవీ ప్రసాద్, ఎస్.రవిబాబు, డ్రైవర్ కమ్ ఆపరేటర్ వి.ఉదయ్‌కుమార్, ఫైర్‌మన్‌లు వెంకటేష్ నాయక్, తిరుపతి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ గౌతమ్, సిబ్బంది

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేత సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

మైలవరం: రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు నెలలకు పైగా ఉపాధి కూలీలకు వేతనాలు రాక వారి కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైలవరం నియోజకవర్గంలో ఉపాధి పనులు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎండలు మండిపోతున్నా కనీసం మజ్జిగ, మంచినీళ్లు, టెంట్‌ల వసతి కల్పించడం లేదని కూలీలు వాపోయారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉపాధి నిధులు అవసరం ఉండగా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుకార్చాలనే పట్టుదలతో ఉందని ఆరోపించారు. అరకొరగా ఉన్న ఈ నిధులను కూటమి ప్రభుత్వం సంబంధం లేని పనులకు కేటాయిస్తోందని విమర్శించారు. గత కొంతకాలంగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన పరికరాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని, ఇది దారుణమన్నారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

చల్లంగా చూడమ్మా.. తిరుపతమ్మ తల్లీ

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మా తిరుపతమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయం తరఫున భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో భక్తులు సేద తీరారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

–పెనుగంచిప్రోలు

పునరుత్థానుడా.. జయహో


సూరంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


ముసునూరు ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధన

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రేమ విందులు

తిరువూరు/మైలవరం/నూజివీడు సర్వ మానవాళి పాప పరిహార్థం ఏసుక్రీస్తు సిలువపై మరణించి మూడో రోజు మరణాన్ని జయించి పునరుత్థానుడయ్యారని పలువురు పాస్టర్లు తెలిపారు. క్రీస్తు పునరుత్థాన దినోత్సవం ఈస్టర్ వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు ప్రసంగిస్తూ ప్రపంచ మానవాళి చరిత్రలో చనిపోయిన తరువాత మరణాన్ని జయించి పునరుత్థానులైన వారు పరిశుద్ధుడైన ఏసుక్రీస్తు ఒక్కరు మాత్రమేనని వివరించారు. ప్రపంచానికి ప్రేమ, కరుణ, శాంతిని ప్రబోధించిన క్రీస్తు మార్గంలో ప్రజలందరూ నడుచుకోవాలని పేర్కొన్నారు.

మైలవరం: మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లోని పలు ఆర్‌సీఎం, క్రీస్తు దేవాలయాల్లో ఈస్టర్ పండుగను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రెడ్డిగూడెం మండలంలోని వెలగలగూడెం ఆర్‌సీఎం చర్చిలో అర్ధరాత్రి దివ్య బలిపూజ నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ డానియల్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు మూడో రోజు సమాధి నుంచి లేచారని, మానవులందరిని రక్షించడానికి పరలోకంలోకి నడిపించడానికి ఏసుక్రీస్తు మృత్యుంజయుడుగా లేచాడన్నారు. మనందరినీ చీకటి నుంచి వెలుగులోకి నడిపించేందుకు దేవుడు మనకు ఒక మార్గం దయ చేశాడని చెప్పారు. మనలోని పాత జీవితాన్ని పారద్రోలి కొత్త జీవితంలోకి అడుగు పెట్టాలన్నారు. ఈస్టర్ అనేది లేకపోతే క్రైస్తవత్వం లేదని ఆయన వివరించారు. పలు ఆలయాల్లో విశ్వాసులు అర్ధరాత్రి పూజల్లో పాల్గొన్నారు.

చాట్రాయి: ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చిల్లో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు ఈస్టర్ ప్రాధాన్యతను వివరించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో..

ముసునూరు: మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచే కీర్తనలు, బైబిలు పఠనాలు, క్యాండిల్ వెలుగుల్లో ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు, అనంతరం ప్రేమవిందు జరిగాయి. రమణక్కపేట, ముసునూరు, కాట్రేనిపాడు విచారణల ఫాదర్లు రెవ.జోసఫ్‌తంబి, జాన్ భారతి, ఇమ్మానుయేలు, సహాయ గురువులు ఇలవర్సన్, విలియమ్స్, క్లారెడ్ ప్రత్యేక దివ్య బలి పూజను సమర్పించి, ప్రజలందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్, న్యూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల అధినేతలు కంబాల రాంబాబు, టి.రూబేన్ వరకుమార్, పాస్టర్లు, సంఘకాపరుల ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దలు, మహిళలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్ని చర్చిల వద్ద ప్రేమవిందులు జరిగాయి.

23న కౌలు హక్కునకు వేలం

నూజివీడు: గొల్లపల్లిలోని శ్రీరఘునాథస్వామి ఆలయానికి చెందిన రామకృష్ణ పబ్లిక్ ట్రస్టు పరిధిలోని గొల్లపల్లి, పోలసానపల్లిలో ఉన్న వ్యవసాయ భూములకు మూడేళ్ల కాలపరిమితికి కౌలు హక్కు కోసం ఈ నెల 23న టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో వేలం జరుగుతుందని చెప్పారు.

23న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మైలవరం: గణపవరం గ్రామంలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో దాసాంజనేయ, గణపతి, సుబ్రహ్మణ్య, శిఖర జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 23న జరుగుతుందని ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. నూతన ధ్వజ స్తంభాన్ని గణపవరం గ్రామ వీధుల్లో ఆదివారం ఊరేగించారు. భారీగా భక్తులు పాల్గొని ధ్వజ స్తంభానికి పూజలు చేశారు. ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం మహా అన్నసమారాధన జరుగుతుందన్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. కంచికచర్ల మండలం బత్తినపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రాజు (35) గ్రామస్తులతో కలిసి వేళంకిని మాత దర్శనం కోసం ఐదు రోజుల కిందట నాగపట్నం వెళ్లాడు. గతంలో భార్య చనిపోవడంతో తన 11 ఏళ్ల కుమార్తెను గొల్లపూడిలోని తన సోదరుని ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. నాగపట్నం నుంచి ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్న అనంతరం తన కుమార్తెను తీసుకువచ్చేందుకు బైక్‌పై గొల్లపూడి బయలుదేరాడు. మూలపాడు వద్దకు చేరుకునేసరికి బైకు అదుపుతప్పి హైవే పక్కన ఆగి ఉన్న లారీని వెనక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజు తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రాజు బంధువులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.


తీవ్రంగా గాయపడిన చింతపల్లి రాజు

ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచికచర్ల: రంగానగర్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుర్రా వీరభద్రరావు మాట్లాడుతూ దాతల ఆర్థిక సహకారంతో రూ. 25 లక్షలతో పనులు చేపట్టామన్నారు.ఆలయ శంకుస్థాపన కోసం అర్చకులు ప్రసాదు నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్భాటాల కోసం అప్పులు.. ప్రజలపై భారాలు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్ ధ్వజం

నూజివీడు: రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్పే పాలకులు ఆర్భాటాల కోసం వేల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలపై పరోక్ష భారాలు వేయటం సమంజసం కాదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో ప్రస్తుతం ఉన్న 50 వేల ఎకరాలు చాలదన్నట్లు మరో 44 వేల ఎకరాలు సేకరించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికే సెక్రటేరియట్, హైకోర్టు భవనాలకు కోట్లు వెచ్చించారని, నూతన భవనాలు నిర్మించాల్సిన పనిలేదని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, విభజన చట్టంలోని హామీలను విస్మరించి ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు మే 2న రాష్ట్రానికి రానున్న మోదీ పర్యటనను వామపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర హక్కులను హరిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపకపోవడం దారుణమన్నారు.